కూలిపోతున్నారు!

- 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతల నమోదు
- మృతి చెందుతున్న 'ఉపాధి' వేతనదారులు
- కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు

● గత నెల 22న మెళియాపుట్టి మండలం చాపర గ్రామానికి చెందిన రాజపు గున్నమ్మ.. చెరువు వద్ద 'ఉపాధిహామీ' పనులు చేస్తుండగా ఎండ తీవ్రత తట్టుకోలేక పడిపోయింది. ఆ సమయంలో ప్రథమ చికిత్స కిట్టు అందుబాటులో లేదు. తోటి వేతనదారులంతా ఆమెను స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. వైద్యసేవలు అందిన కొద్దిసేపటి తర్వాత ఆమె కోలుకుంది.

....

● గత నెల 26న సరుబుజ్జిలి మండలం ఇసుకపాలేం గ్రామానికి చెందిన గుజ్జల గన్నిరాజు ఉపాధిహామీ పనులు చేస్తుండగా కుప్పకూలి మృతి చెందాడు. పనిచేసే చోట ఓఆర్ఎస్ ప్యాకెట్లు కానీ, ప్రాథమిక చికిత్స కిట్లు కానీ లేకపోవడంతో తోటి వేతనదారులంతా నిస్సహాయంగా ఉండిపోయారు.

....



● ఈ నెల 8న టెక్కలి మండలం రావివలస గ్రామానికి చెందిన అనపాన పార్వతి చెరువు పనులు చేస్తుండగా మృతి చెందింది. ఆమెను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

....

● ఈ నెల 8న ఇచ్ఛాపురం మండలం చిన్నా లక్ష్మీపురానికి చెందిన దున్న దుర్యోధన చెరువు పనులు చేస్తుడంగా కుప్పకూలి మృతి చెందాడు. కనీసం ప్రాథమిక వైద్యసేవలు అందించడానికి కూడా మందులు అందుబాటులో లేకపోవడంతో దుర్యోధన మృతి చెందాడని వేతనదారులు ఆవేదన వ్యక్తం చేశారు.



మండుటెండలో పనులు చేస్తున్న ఉపాధిహామీ వేతనదారులు

మెళియాపుట్టి, మే 9(ఆంధ్రజ్యోతి): వేసవి వేళ.. కనీస సౌకర్యాలు లేక ఉపాధిహామీ వేతనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత 40 డిగ్రీలకుపైగా పెరగడంతో కొంతమంది వడదెబ్బకు గురై పనిచేసే చోట కుప్పకూలిపోతున్నారు. ఈ క్రమంలో కొంతమంది అస్వస్థతకు గురికాగా.. మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. గురువారం ఒక్కరోజే జిల్లాలో ఇద్దరు మృతి చెందడంతో వేతనదారులంతా ఆందోళన చెందుతున్నారు. పనులు చేసే చోట్ల టెంట్లు కానీ, తాగునీటి సదుపాయం కానీ లేదని వాపోతున్నారు. కుప్పకూలి పడిపోయినా.. ప్రాథమిక వైద్యం అందించేందుకు ప్రథమ చికిత్స కిట్లు లేవని పేర్కొంటున్నారు. ఇటీవల ఢిల్లీ నుంచి కేంద్ర బృందం జిల్లాలో పర్యటించింది. ఆ సమయంలో అధికారులు సైతం ప్రథమ చికిత్స కిట్లతోపాటు సౌకర్యాల కోసం ఫిర్యాదు చేశారు. కానీ ఇంత వరకూ కల్పించలేదని కూలీలు వాపోతున్నారు.

జిల్లాలో ఉపాధిహామీ (మిగతా 8వ పేజీలో..)

భగ్గుమన్న భానుడు

- జిల్లాలో తీవ్ర వడగాల్పులు
- ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు

శుక్రవారం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)	
మెళియాపుట్టి	40.0
పాతపట్నం	40.0
హిరమండలం	40.2
సారవకోట	40.3
పొందూరు	40.6
బూర్జ	40.7

శ్రీకాకుళం, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఎండ తీవ్రత, వడగాల్పులతో ప్రజలు అల్లాడిపోయారు. మైదాన ప్రాంతాల్లో ఏకంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటేసింది. మూడు మండలాల్లో తీవ్రంగా వడగాల్పులు వీచాయి. శుక్రవారం మధ్యాహ్నానికి బూర్జ, హిరమండలం, మెళియాపుట్టి, పొందూరు, సారవకోట మండలాల్లో నిప్పులు కురిసినట్లుగా వాతావరణం మారింది. వేడిగాలులు భరించలేక.. ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు ఆపసోపాలు పడ్డారు. ఈనెలాఖరు వరకు ఉష్ణోగ్రతలు ఇదేరీతిన పెరిగే అవకాశం ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. ఈ క్రమంలో శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట, ఆమదాలవలస, సోంపేట ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి రోడ్లపై జనసంచారం తగ్గిపోతోంది. మిట్ట మధ్యాహ్నం భానుడి కర్ఫ్యూ అన్నట్లు రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.



శ్రీకాకుళంలో ఎండ తీవ్రతకు రక్షణ ఇలా..



మస్కట్ నుంచి జిల్లాకు చేరుకున్న కార్మికులు

మస్కట్ నుంచి క్షేమంగా స్వదేశానికి..

- కేంద్రమంత్రి రామ్మోహన్ చొరవతో ఇళ్లకు చేరుకున్న కార్మికులు

7 లో

రాష్ట్రంలో విమానయాన సేవల విస్తరణ

- కనెక్టివిటీ సౌలభ్యాన్ని పెంపొందించే దిశగా..
- పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

7 లో


ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా పద్మనాభరాజు



పద్మనాభరాజు

ఎచ్చెర్ల, మే 9(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల సాయుధ పోలీసు క్వార్టర్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు పదోన్నతిపై నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. బెటాలియన్ నిర్మాణం, నిర్వహణ కార్యకలాపాలపై సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు నిర్వహణ, తీవ్రవాద నిర్మూలన, అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకట్టవేయడంతో పాటు అన్ని రకాల పోలీసింగ్ కార్యక్రమాల్లో పోలీసు యంత్రాంగానికి సహాయకారిగా బెటాలియన్ కార్యకలాపాలు సాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ పి.సత్తిరాజు, అసిస్టెంట్ కమాండెంట్‌లు పాల్గొన్నారు.

18 ఏళ్ల కన్నీటి గాథ!



● మందస మండలం బెల్లుపటియా వద్ద పద్దెనిమిదేళ్ల కిందట భారీ వర్షాలకు కూలిన ఇనుప దోనె (అక్వాడెక్ట్) ఇది. లక్షలాది రూపాయలు ఖర్చుచేసినా నిరుపయోగంగా మారింది. గతంలో కాంగ్రెస్ నాయకుల చేతివాటంతో నిధులు పక్కదారి పట్టడంతో అన్నదాతలకు ఆక్రందన మిగిలింది. నాటినుంచి నేటికీ ఇలాగే కన్పిస్తోంది.

- మరమ్మతులకు నోచుకోని దోనె
- లక్షలాది రూపాయలు వృథా
- అన్నదాతల్లో ఆందోళన
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

● లక్షల రూపాయలు ఖర్చుచేసినా కనీసం చుక్కనీరు పొలాలకు అందకపోవటంతో రైతులంతా సొంత డబ్బులతో బెల్లుపటియా వద్ద అక్వాడెక్టుపై ఇలా పైపులు వేసుకుని నీటిని తరలిస్తున్నారు. అయినా ఏడాది పొడవునా శివారు భూములకు సాగునీరందక పొట్ట దశలో వరి పంట నష్టపోతున్నామని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వమే స్పందించి పునర్నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.



హరిపురం, మే 9(ఆంధ్రజ్యోతి):

రాజుల పాలనలో మందస మండలం బెల్లుపటియా వద్ద చీపి గెడ్డపై నిర్మించిన ఇనుప దోనె (అక్వాడెక్టు)వందల ఏళ్లపాటు రైతులకు ఎంతో సేవలందించింది. మహేంద్రతనయా నీటి కోసం రైతుల సౌకర్యార్థం నిర్మించిన ఈ దోనె.. 2007లో భారీ వర్షాల ఉధృతికి ఒకవైపు గట్టు కొట్టుకుపోయి కూలిపోయింది. మందస మండలంలో డబార్సింగి, కళింగదల్, సునాముది వంటి నీటివనరుల తరువాత అంతే స్థాయితో సుమారు 1200 ఎకరాలకు అధికారికంగా, మరో 2,250 ఎకరాలకు అనధికారికంగా ఈ అక్వాడెక్టు నుంచి నీరందుతుంది. మహేంద్రతనయా నది నుంచి వచ్చే నీటిని చీపిగెడ్డకు అడ్డంగా ఈ దోనెను నిర్మించారు. దీంతో మందస, సోంపేట మండలాల పరిధిలో సుమారు 12గ్రామాలకు సాగునీరందేది. కాగా కొన్నేళ్ల కిందట వరద ఉధృతికి దోనె కూలిపోయింది. దీంతో మహేంద్రతనయా నీరు రాక పొలాలన్నీ బీడు భూములుగా మారాయి. ఈ క్రమంలో రైతులంతా సొంత డబ్బులతో ప్లాస్టిక్ గొట్టాలు అమర్చి నీటిని తరలించి సాగు చేపట్టారు. రైతు ప్రభుత్వమంటూ కాంగ్రెస్ నాయకులు 2009లో రూ.51లక్షలతో దోనె పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కొంత నిధులు ఖర్చుచేసి తూతూమంత్రంగా పనులు చేపట్టి అర్థాంతరంగా నిలిపివేశారు. పద్దెనిమిదేళ్ల నుంచి పనులు ముందుకు సాగడం లేదు. అలాగే ఇనుపదోనె ముందు భాగంలో మరో రూ.3లక్షలతో సిమెంట్ కాలువ నిర్మించారు. నాణ్యతా లోపంతో పదినెలలు కూడా ఈ కాలువ లేదు. బీటలు దేరి నీరు రాని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దోనె పునర్నిర్మాణ పనులు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్‌నాటికైనా సాగునీరందించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● ఈ విషయమై జలవనరుల శాఖ ఏఈఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. దోనెను పరిశీలించి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి దోనె పునర్నిర్మించేలా కృషి చేస్తానని తెలిపారు.

అమ్మో.. కొబ్బరి బొండాం

- ఠారెత్తిస్తున్న ధరలు
- రాజమండ్రి నుంచి కూడా దిగుమతి





పలాస మార్కెట్‌లో దిగుమతైన కొబ్బరి బొండాలు

పలాస, మే 9(ఆంధ్రజ్యోతి):

ఉద్దానం కొబ్బరికి మరేదీ సాటిలేదు. ఇక్కడ కొబ్బరి బొండాల్లో లభించే నీటి రుచే వేరు. ఇదంతా ఒకప్పటి మాట. ప్రస్తుతం ఈ ప్రాంతంలో కొబ్బరి బొండాలు లభించకపోవడంతో రాజమండ్రి నుంచి కూడా దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో కారుచౌకగా లభించే కొబ్బరి బొండాలు వేసవి పుణ్యమా రూ.50 నుంచి రూ.75 వరకూ ధర పలుకుతోంది. సాధారణంగా ఉద్దానం ప్రాంతం కొబ్బరి, జీడి పంటలకు ప్రసిద్ధి. 1999లో సూపర్‌సైక్లోన్, తర్వాత హుద్‌హుద్, పైలిన్ తుఫాన్‌లతో మొత్తం జీడి, కొబ్బరి పంటలు నాశనమయ్యాయి. ఉన్న పంట కూడా 2018 తిత్లీ తుఫాన్‌తో ఊడ్చుకుపోయింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 20వేల హెక్టార్లుల్లో కొబ్బరి పంట తీవ్రంగా నష్టపోయిందని అంచనా. తరువాత కొత్త మొక్కలు వేసినా ఆశించినంతగా దిగుబడి లేకపోవడం, రైతులు కూడా ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యోగాల వేటలో ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్న కారణంగా మన కొబ్బరికి కష్టకాలం వచ్చింది. మార్కెట్‌లో కొబ్బరికాయల ధరలు కూడా ఒక్కసారిగా ఆకాశాన్ని అంటాయంటే నమ్మశక్యం కాదు. తితలీ తుఫానుకు ముందు రూ.10కు దొరికే కొబ్బరికాయ, బొండాలు ప్రస్తుతం రూ.50 పెడితే కాని లభించడం లేదు. సాధారణంగా వేసవిలో కొబ్బరి బొండాలకు మంచి గిరాకీ ఉంటుంది. కానీ వాటి ధర మూడింతలు పెరిగిపోవడంతో సామాన్యుడికి అందని ద్రాక్షగా మారింది. దీనికితోడు కొబ్బరి కాయలు, బొండాలు లభ్యం కాకపోవడంతో రాజమండ్రి నుంచి కొంతమంది వ్యాపారులు టోకు ధరలకు దిగుమతి చేస్తున్నారు. రాజమండ్రిలో ఒక్కొక్కటి రూ.17కు కొనుగోలు చేసి.. ఇక్కడ రూ.30కి విక్రయిస్తున్నారు. పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలకు ప్రతిరోజు ఐదువేల కొబ్బరి బొండాలు అవసరం ఉంటాయి. అంతభారీగా లభించకపోవడంతో చిల్లర వ్యాపారులు గార, రణస్థలం వంటి ప్రాంతాల నుంచి వ్యానులపై తీసుకువచ్చి ఒక్కో కాయ రూ.35 వరకూ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. మార్కెట్ ఆశీలు, షాపు అద్దెలు కలుపుకొని వ్యాపారులు రూ.50 నుంచి, పెద్దబొండాలు రూ.75వరకూ విక్రయిస్తున్నారు. అధిక ధరల నుంచి కొబ్బరి బొండాలకు ఎప్పుడు విముక్తి లభిస్తుందోనని పలువురు ఎదురుచూస్తున్నారు.

మాదకద్రవ్యాల రవాణాపై ప్రత్యేక నిఘా

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కన ఎస్పీ జేసీ

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 9(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు కఠినచర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'విద్యార్థులు, వర్కర్లు, ఆటోడ్రైవర్లే లక్ష్యంగా జరుగుతున్న మత్తు పదార్థాల సరఫరాను గుర్తించాలి. డ్రగ్స్ విక్రయాల ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలి. బాధితులకు కౌన్సెలింగ్‌తోపాటు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. మెడికల్ షాపుల్లో సీసీ కెమెరాలు అమర్చాలి. ప్రిస్క్రిప్షన్ లేకుండా 18ఏళ్ల లోపు వారికి మందులు ఇవ్వరాదని సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. సోషల్ మీడియాలో డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రచారం నిర్వహించాలి. గ్రామస్థాయిలో ఆశావర్కర్లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలతో పర్యవేక్షణ చేపట్టాల'ని ఆదేశించారు. మత్తు పదార్థాల నివారణకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.

'1972'కి సమాచారం ఇవ్వండి: ఎస్పీ

ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 'ఈగల్ టీమ్‌తో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక నిఘా పెట్టాం. డ్రగ్స్ సమాచారం కోసం 112 లేదా 1972 నెంబర్లకు ఫోన్ చేయాలి. జీజీహెచ్‌లో(రిమ్స్) డీ-అడిక్షన్ సెంటర్‌ను అందుబాటులో ఉంచుతాం. హాస్టళ్లలో డ్రగ్స్ వాడకంపై పర్యవేక్షిస్తాం. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్ల పరిసరాల్లో బోర్డులు ఏర్పాటు చేస్తామ'ని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కఠినచర్యలు

జిల్లాలో రోడ్డుభద్రతా చర్యలను మరింత కఠినతరం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన రహదారుల భద్రతా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను బలోపేతం చేయాలి. డివైడర్లను తొలగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి. ఇటీవల జరిగిన ప్రమాదాలపై ఇంజనీరింగ్ అధికారులు విశ్లేషణ చేయాలి. 108 వాహన సేవలు అందుబాటులో ఉండాలి. పాఠశాలలు, కళాశాలల వద్ద స్పీడ్ బ్రేకర్లు, మలుపుల వద్ద బారికేడ్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలి. పెట్రోలు బంకుల వద్ద సీసీ కెమెరాలు అమర్చాలి. బ్లాక్‌స్పాట్స్ గుర్తించి డ్రైవర్ల కోసం రెస్ట్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలి. అతివేగం, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపేవారిపై కఠినచర్యలు తీసుకోవాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి. కమర్షియల్ ప్రాంతాల్లో మునిసిపల్ కమిషనర్లు చర్యలు చేపట్టాలి. ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు కోసం వైద్యారోగ్యశాఖ చర్యలు తీసుకోవాలి. విద్యాసంస్థల్లో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల'ని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సుధాకర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ విజయసారథి, ఇతర అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

12 నుంచి భైరిపురంలో నాటిక పోటీలు

కవిటి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరిపురం గ్రామంలో ఈ నెల 12 నుంచి 14 వరకు అంతర్రాష్ట్ర ఆహ్వానిత నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి వారి సౌజన్యంతో భైరిపురం కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు

ఇచ్ఛాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు లేని కుటుంబాలు కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వెంకటరావు ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త రేషన్‌కార్డు, కొత్తగా చేర్పులు, పాత కార్డు నుంచి సభ్యుల తొలగింపు, చిరునామా మార్పు, ఆధార్ కార్డు నెంబర్ల మార్పు చేసుకొనేందుకు సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పారా లీగల్ వలంటీర్ల నియామకానికి...

సోంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్ల నియామకానికి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సోంపేట మండల న్యాయ సేవా సంస్థ అధ్యక్షులు, ఆరో అదనపు జిల్లా జడ్జి కె.కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వయోవృద్ధులు, ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, న్యాయ విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, సేవాదృక్పదం కలిగిన ప్రభుత్వేతర సంఘ సభ్యులు, మైత్రీ సంఘ సభ్యులు తదితరులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని స్పష్టం చేశారు. సోంపేట, బారువ, కంచిలి, మందస మండలాల వారే అర్హులని స్పష్టం చేశారు.

శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించండి


ఎమ్మెల్యే అశోక్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

ఇచ్ఛాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం గ్యాస్ ఏజెన్సీ ఎదురుగా ఉన్న శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తామని, దీనికి సహకరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను స్థానిక రోటరీ క్లబ్ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం రామయ్యపుట్టుగలోని తన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు దినేష్ కుమార్, రామారావు, డాక్టర్ వేదవ్యాస్, పాక తులసీదాస్‌రెడ్డి, నవీన్ చౌదరి, టీడీపీ నాయకులు కాళ్ల జయదేవ్, ఆశి లీలారాణి, పట్టణ కార్యదర్శి నందికి జాని తదితరులు పాల్గొన్నారు.

గోఖలే సేవలు స్ఫూర్తిదాయకం

శ్రీకాకుళం కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యోద్యమాన్ని ముందుకు నడిపించిన తొలితరం నేత గోపాలకృష్ణ గోఖలే సేవలు స్ఫూర్తిదాయకమని గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు సురంగి మోహనరావు అన్నారు. గోఖలే జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక గాంధీ మందిరంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.ప్రసాదరావు, పందిరి అప్పారావు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, కొంక్యాన వేణుగోపాల్, నిష్టల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో నేలకు ఉపయోగం

ఆమదాలవలస, మే 9 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాలతో నేలకు ఎంతో ఉపయోగమని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అన్నారు. చేపేనపేట ప్రకృతి వ్యవసాయ యూనిట్ పరిధిలో సిబ్బంది రైతులతో నవధాన్యాల విత్తనాలను వేయించారు. ఈ సందర్భంగా చేపేన సురేష్ మాట్లాడుతూ యూనిట్ నిమ్మతొర్లువాడ గ్రామంలో 8 మంది రైతులతో 11 ఎకరాల విస్తీర్ణంలో నవధాన్యాల విత్తనాలను వేయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీఆర్‌పీఎస్ తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, రైతు నక్క దేవదత్తు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

పొందూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) తండ్యాం పంచాయతీ మన్నెపేట కొండపై వెలసిన అలివేలు మంగమ్మ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గన్నవరపు రాంబాబు, మావుదూరి సంతోష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల ఎంపీడీవోగా రామ్మోహనరావు

ఎచ్చెర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండల పరిషత్ ఏవోగా పనిచేస్తున్న పీవీ రామ్మోహనరావును పూర్తి అదనపు బాధ్యతలతో (ఎఫ్‌ఏసీ) ఎంపీడీవోగా నియమిస్తూ జడ్పీ సీఈవో ఎల్‌ఎన్‌వీ శ్రీధర్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ రెగ్యులర్ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఎస్.హరిహరరావు మెడికల్ లీవ్‌పై వెళ్లగా, ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావుకు గతంలో ఈ బాధ్యతలు అప్పగించారు. టెక్కలిలో జరిగిన ఓ వ్యవహారంలో మల్లేశ్వరరావు ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో ఏవో రామ్మోహనరావుకు ఎంపీడీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రాణా ప్రతాప్‌సింగ్ జయంతి వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాణా ప్రతాప్‌సింగ్ జయంతిని శుక్రవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఎ.పి.హెచ్.బి.కాలనీలోని ఆర్.ఎస్.ఎస్. కార్యాలయంలో రాణాప్రతాప్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజా అరవింద్ సింగ్, ధన్‌సింగ్, ఆదిత్య సింగ్, హిమబిందు బాయ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పొందూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉండాలంటే సామాన్య పౌరులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పొందూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.జ్యోత్స్న అన్నారు. కింతలి గ్రామంలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టం, చెక్‌బౌన్స్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడి ప్రసాద్, ఎంపీటీసీ కె.హనుమంతురావు, న్యాయవాదులు కె.మంజుల, బ్రహ్మాజీ, రాము, కృష్ణ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవిల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ 21వ బ్యాచ్ శిక్షణకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ తెలిపారు. ఈ శిక్షణకు లైట్ మోటార్ వెహికల్ లైసెన్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94411 61051, 93908 86033 నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదు


సమస్యలు వింటున్న ఎమ్మెల్యే రవికుమార్


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

ఆమదాలవలస, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన ప్రజలు వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు ఇచ్చారు. కొంతమంది గ్రామ సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వివిధ ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సంబంధిత ఉద్యోగులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. విధి విధానాలు, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్న ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కొంతమంది గ్రామ సచివాలయ ఉద్యోగులు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తూ లంచాలకు అలవాటు పడినట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారిని విధుల నుంచి తొలగించడం లేదా వేరే ప్రాంతానికి బదిలీ చేయడం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, నూకరాజు, సనపల అప్పలనాయుడు, కె.ఆంజనేయులు, ఎ.భాస్కరరావు, మురళీధర్ యాదవ్, పి.వి.నరసింహం, బి.గౌరీపతిరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

పురపాలక సంఘంలోని 8వ వార్డులోని వైసీపీకి చెందిన వివిధ కుటుంబాల వారు ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ ఇన్‌చార్జి దవళ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

రణస్థలం, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకొని... వాటిని పరిష్కరించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశపు మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని బాధితులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. పింఛన్లు, హౌసింగ్, భూ సమస్యలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.ప్రసాద్, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ తిరుమలలో విశ్వరూప దర్శనం


వెంకన్న విశ్వరూప దర్శనం

శ్రీకాకుళం కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పి.ఎన్.కాలనీలో ఉన్న నారాయణ తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి శుక్రవారం విశ్వరూప దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి అర్చకులు జి.శ్రీనివాసులు క్షీరాభిషేకం చేశారు. స్వామివారి విశ్వరూప సందర్శనం కోసం భక్తులు బారులు తీరారు. శనివారం శ్రీ వేంకటేశ్వర స్వామి స్వర్ణ కవచంలో దర్శనమివ్వనున్నారు. ఈ మేరకు ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

మస్కట్ నుంచి క్షేమంగా స్వదేశానికి..

కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు చొరవతో ఇళ్లకు చేరిన కార్మికులు

శ్రీకాకుళం, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం మస్కట్ వెళ్లి... అక్కడ చిక్కుకుపోయిన జిల్లాకు చెందిన కార్మికులు ఎట్టకేలకు స్వదేశానికి చేరుకున్నారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చొరవతో క్షేమంగా రాగలిగారు. ఇచ్ఛాపురం ప్రాంతానికి చెందిన కార్మికులు ఓ ప్రైవేటు కంపెనీ చేతిలో మోసపోయి.. నెలల తరబడి మస్కట్‌లో మగ్గిపోయారు. కొన్ని నెలలు పాటు పని, జీతం లేకుండా.. అర్ధాకలితో అల్లాడిపోయారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఆ సమాచారాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి మస్కట్‌లోని భారత దౌత్య కార్యాలయ అధికారులతోనూ.. టీడీపీ ఎన్ఆర్ఐ విభాగంతో సమన్వయం చేసి .. కార్మికులకు తక్షణ వసతి, ఆహారం అందేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం ఇక్కడికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో ముంబై విమానాశ్రయ అధికారులతో మాట్లాడి ఆహారం సమకూర్చేలా చేశారు. ముంబై నుంచి శ్రీకాకుళం వరకు ప్రయాణ ఖర్చులు భరించి తొమ్మిది మందిని సురక్షితంగా స్వస్థలాలకు చేర్పించారు. వీరంతా తమ ఊళ్లకు చేరుకుని.. కుటుంబ సభ్యులను కలసిన అనంతరం కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. విదేశంలో పని లేక ఆకలితో తీవ్రంగా ఇబ్బంది పడ్డామని..అత్యంత వేగంగా సాయం చేశారని కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు స్పందిస్తూ...'రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యలే తనకు ముఖ్యమని.. ఎక్కడైనా ఎవరికైనా సాయం అవసరమైతే వెంటనే తెలియజేయండి' అని సూచించారు.

రాష్ట్రంలో విమానయాన సేవల విస్తరణ

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విమానయానాన్ని మరింత ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కనెక్టివిటీ, సౌలభ్యాన్ని పెంపొందించేందుకు కొత్తగా మూడు విమాన సేవలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

- విశాఖపట్నం-అబుదాబి అంతర్జాతీయ సర్వీస్ జూన్ 13 నుంచి ఇండిగో సంస్థ ద్వారా ప్రారంభం కానుందని వివరించారు. వారంలో నాలుగు రోజుల పాటు నడిచే ఈ సర్వీస్ యూఏఈతో పాటు ఇతర దేశాలలోని ప్రవాసాంధ్రులను విశాఖపట్నంతో నేరుగా కలపనుంది అని తెలిపారు.
- విశాఖపట్టణం - భువనేశ్వర్ విమాన సర్వీసు జూన్ 12 నుంచి ప్రారంభం కానుందని తెలియజేశారు.
- జూన్ 2 నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ విజయవాడ - బెంగళూరు అదనపు విమాన సేవను ప్రారంభించనుందని వివరించారు.

జవాన్ మృతిపై మంత్రి అచ్చెన్న దిగ్ర్భాంతి

శ్రీకాకుళం, మే 9 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో పాక్ కాల్పుల ఘటనలో సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన మురళీనాయక్ మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్ మురళీనాయక్ మృతి తీవ్రంగా కలిచివేసిందని అన్నారు. జవాను ధైర్య, సాహసాలు రాష్ట్రానికి, దేశానికి గర్వకారణమని కొనియాడారు. మురళీ నాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కమిటీలతో సంస్థాగతంగా బలోపేతం: ఎంపీ కలిశెట్టి


మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఎచ్చెర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): అన్ని నియోజకవర్గాల్లో గ్రామ, మండల స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి... టీడీపీని మరింత బలోపేతం చేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు. చిలకపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయి టీడీపీ కార్యకర్తలతో కమిటీలు ఏర్పాటు, సంస్థాగత నిర్మాణం, రాబోయే రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాలపై విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కమిటీల ఏర్పాటులో ఎలాంటి జాప్యం చేయొద్దన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు, పథకాలను అర్హులకు చేరవేయడం, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో కార్యకర్తలు ప్రధాన భూమిక పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు ఆనెపు రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు బెండు మల్లేశ్వరరావు, కుమరాపు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ


కవిటిలో ర్యాలీ చేస్తున్న స్థానికులు

కవిటి, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌ను మట్టి కరిపిస్తున్న భారత సైన్యానికి మద్దతుగా కవిటిలోని చింతామణి కాలనీ వాసులు శుక్రవారం ర్యాలీ చేపట్టారు. చిన్నారులు, యువకులు కలసి జాతీయ జెండాలు చేతపట్టి భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. స్థానిక బస్టాండు కూడలిలో మానవహారం నిర్వహించారు.

ఇచ్ఛాపురంలో...

ఇచ్ఛాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా వైసీపీ నాయకులు శుక్రవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీ బోర పుష్ప, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు నర్తు నరేంద్ర, నర్తు ప్రేమ్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్


పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, మే 9(ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డా.కె.శ్రీధర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం 11వ సబ్ జూనియర్, 10వ జూనియర్, 8వ సీనియర్ జిల్లా స్థాయి ఉషు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా, ఉపాధి రంగాల్లో స్పోర్ట్స్ కోటా పెంచడం వల్ల క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘ ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. అనంతరం పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉషు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పొగిరి కృష్ణంనాయుడు, రెడ్డి శివకుమార్, వాకర్స్ క్లబ్ సభ్యులు జోగినాయుడు, జి.ఇందిరాప్రసాద్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, రెడ్డి సాయికుమార్, జి.లక్ష్మి, మురళీమోహన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

పాత శ్రీకాకుళం, మే 9 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఉపాధ్యాయ వర్గాల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) డిమాండ్ చేసింది. శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద జిల్లా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్ మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని.. తెలుగు మాధ్యమంలో విద్యాభ్యాసానికి అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వం బకాయి ఉన్న డీఏ, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో వెంకటరావును కలసి ఉపాధ్యాయులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నేతలు ఎస్వీ అనిల్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి, పేడాడ అప్పలనాయుడు, నవీన్‌కుమార్, పప్పల తిరుమలరావు పాల్గొన్నారు.

రేపటి సదస్సును విజయవంతం చేయండి

అరసవల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్స్ కార్మికులకు వరమా...లేక శాపమా అనే అంశంపై ఈ నెల 11న శ్రీకాకుళంలో తలపెట్టిన సదస్సును విజయవంతం చేయాలని సిటు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావులు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 11న శ్రీకాకుళంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సదస్సు జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్వి.రమణ, అల్లు సత్యనారాయణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు.

బాల్య వివాహాల నిరోధానికి చర్యలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థను నిరోధించేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి.. కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మిషన్ వాత్సల్య పథకంపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో బాలల సంక్షేమ, రక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాథలు, డ్రాప్ అవుట్ బాలలు, కార్మికులుగా పనిచేస్తున్న చిన్నారులను గుర్తించి పునరావాసం కల్పించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో బాల్య వివాహాల సమాచారం అందిన వెంటనే వాటిని నిలిపివేసి.. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలన్నారు. టీనేజీ ప్రెగ్నెన్సీ, ట్రాఫికింగ్, డ్రగ్స్, పోపీడీ వంటి అంశాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. బాధిత బాలికలకు వన్‌స్టాప్ సెంటర్ల ద్వారా తక్షణ ఆశ్రయం, చికిత్స, న్యాయ సహాయం అందించాలని తెలిపారు. కేసులపై మహిళా పోలీసులు నిరంతర అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రాప్ అవుట్ బాలికల సమస్యలపై డీఈవో, కార్మాగారాల్లో పనిచేస్తున్న బాలికల విషయమై లేబర్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆరు నెలలకోసారి జిల్లా స్థాయిలో కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీఎంహెచ్ఓ డా.అనిత, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, వివిధ స్వచ్ఛంద సంస్థలు, చైల్డ్‌లైన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చెంపపై కొట్టి.. వీపుపై దాడిచేసి

● నరసన్నపేటలో విద్యార్థికి బొబ్బలెక్కిన వైనం
● కోచింగ్ కేంద్రంలో కొట్టిన ఉపాధ్యాయుడు
● కుటుంబ సభ్యులు, ఏబీవీపీ నాయకుల ఆందోళన


శ్రీకర్ వీపుపై బొబ్బలు ఎక్కిన దృశ్యం

నరసన్నపేట, మే 9(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని జీసీ హోం సమీపంలోగల ఓ నవోదయ కోచింగ్ కేంద్రంలో తొమ్మిదేళ్ల బాలుడిని ఉపాధ్యాయుడు చెంపపై కొట్టడంతోపాటు, కర్రతో వీపుపై దాడిచేయడంతో బొబ్బలెక్కాయి. దీంతో కుటుంబసభ్యులు, ఏబీవీపీ ప్రతినిధులు ఆందోళన నిర్వహించారు. బాలుడిపై దాడిచేసిన ఉపాధ్యాయుడుపైచర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కుటుంబ సభ్యులు, విద్యార్థి, స్థానికుల కథనం మేరకు.. నరసన్నపేటలోని ఓ నవోదయ కోచింగ్ కేంద్రంలో పోలాకి మండలంలోని ఈదులవలసకు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు ముద్దాడ శ్రీకర్ కోచింగ్‌లో చేరాడు. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కోచింగ్ కేంద్రంలో తోటి విద్యార్థులతో ఆడుకుంటున్న శ్రీకర్ చెంపపై ఓ టీచర్ కొట్టడంతోపాటు, కర్రతో వీపుపై దాడిచేయడంతో బొబ్బలెక్కాయి. సదరు ఉపాధ్యాయుడు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఏమీ రాదని హేళన చేయడంతోపాటు శ్రీకర్‌పై దుర్భాషలాడాడు. గురువారం రాత్రి ట్యూషన్ విడిచిపెట్టిన తర్వాత శ్రీకర్ తనపై టీచర్ దాడికి పాల్పడిన వ్యవహారాన్ని తండ్రి శ్రీనివాసరావుకు తెలియజేశాడు. ఈమేరకు ఉపాధ్యాయుడు కొట్టిన వైనం శుక్రవారం వెలుగులో వచ్చింది. శ్రీకర్ వీపుపై ఎర్రని మచ్చలతో బొబ్బలు ఉండడంతో కుటుంబ సభ్యులు నవోదయ కోచింగ్ కేంద్రం నిర్వాహకుడికి ప్రశ్నించగా సరిగ్గా స్పందించలేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు సామాజిక మధ్యమాల ద్వారా వెలుగులోకి తీసుకొచ్చారు. దీంతో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మదన్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు శుక్రవారం కోచింగ్‌కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ అభ్యసిస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మదన్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ శ్రీకర్‌పై దాడిచేసిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతిలేకుండా ట్యూషన్‌పేరుతో విద్యార్థులకు రోజాంతా క్లాసులు నిర్వహించడం, హాస్టల్ నిర్వహణ, కోచింగ్‌కు రూ.30వేలు ట్యూషన్ ఫీజు వసూలుచేయడం వంటి విష యాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలుతీసుకోవాలని డిమాండ్‌చేశారు. కాగా శ్రీకర్‌పై దాడిచేసిన ఉపాధ్యాయుడ్ని ప్రశ్నించేందుకు ఏబీవీపీ నాయ కులు, కుటుంబ సభ్యులు కోచింగ్ కేంద్రంలో వెళ్లిన నిమిషాల వ్యవధిలోనే పోలీసులు అక్కడకు చేరుకున్నారు. శ్రీకర్‌పై దాడి విషయాన్ని ఏఎస్‌ఐ సింహాచలం తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. కోచింగ్ కేంద్రం నిర్వహణకు అనుమతులపై ఆరాతీశారు. లేబర్ సర్టిఫికెట్ తప్ప మిగతా అనుమతులులేవని నిర్ధారించారు. నిర్వాహకులపై కేసు నమోదుచేయలేదని ఏఎస్‌ఐ సింహాచలం తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఎచ్చెర్ల, మే 9(ఆంధ్రజ్యోతి): కొత్తవానిపేట గ్రామానికి చెందిన కొత్త రమణ (32) పురుగుల మందును తాగి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎచ్చెర్ల పోలీసుల కథనంమేరకు. రమణకు అదే గ్రామానికి చెందిన మీనాతో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది.మద్యంతాగే అలవాటుఉన్న రమణ నిత్యం భార్యతో గొడవ పడుతుండేవాడు.గురువారం ఇంటి పేరంటాలకు సంబంధించి గుండం కార్యక్రమానికి కుటుంబ సభ్యులంతా హాజరయ్యారు. మధ్యాహ్న భోజనాల అనంతరం తిరిగి ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు ఈక్రమంలో అప్పటికే మద్యం తాగిన రమణ, భార్యతో మళ్లీ గొడవపడ్డాడు.ఆమె భర్త మీద కోపంతో కన్నవారింటికి వెళ్లిపోయింది.దీంతో తనకు బతకాలని లేదని, చనిపోతానని రమణ కొంతమందికి ఫోన్‌చేసి చెప్పాడు.ఆతర్వాత పురుగులమందు తాగాడు. దీనిని గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం శ్రీకాకుళం నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు.రమణకు భార్యతోపాటు ఇద్దరు పిల్లలుఉన్నారు. తండ్రి అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా నరసన్నపేటలో ఎటువంటి అనుమతులు లేకుండా కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా విస్తరించాయని, వీటిని అరికట్టేందుకు విద్యాశాఖఅధికారులు చొరవతీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆమదాలవలస, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్డు) రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. కుద్దిరాం రైల్వేగేటు వద్ద జరిగిన ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తికి సుమారు 47 ఏళ్ల ఉంటాయన్నారు. మృతదేహంపై బిస్కెట్ కలర్ చొక్కా, నలుగురంగు ప్యాంటు ఉన్నాయన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు స్థానిక రైల్వే స్టేషన్‌లోని జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధుడు...

హిరమండలం, మే9 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అంబావల్లికి చెందిన చిట్టి లక్ష్మీనారాయణ (74) చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ ఎండీ యాసిన్ కథనం మేరకు.. అంబావల్లికి చెందిన చిట్టి లక్షీనారాయణ ఏప్రిల్ 26నరాత్రి తన ఇంటి డాబాపైకి పడుకునేందుకు వెళ్లాడు.నడుస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడికింద సిమెంట్‌రోడ్డుపైకి జారిపడ్డాడు.దీంతో తలకు బలంగా గాయంకావడంతో కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్ తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు.హెడ్‌కానిస్టేబుల్ బీహెచ్ రమణ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పినివలస యువకుడు..

బూర్జ, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉప్పినివలస గ్రామానికి చెందిన బుడుమూరు శంకరరావు(30) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం...ఈనెల 5న ఇంటిలోనే మద్యం మత్తులో అతను పురుగుల మందు తాగాడు. అస్వస్థతకు గురవడంతో మరుసటి రోజు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతోవారు చికిత్సకోసం ఆయన్ను శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు.అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. శంకరరావు తాపీ పని చేసుకొని జీవించేవాడు. బూర్జ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి జైలుశిక్ష

పలాసరూరల్, మే9(ఆంధ్రజ్యోతి):మండలంలోని బ్రాహ్మణతర్లాకు చెందిన వడ్డి సంతోష్ మద్యానికి బానిసై 2022లో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో శుక్రవారం సోంపేట కోర్టు న్యాయాధికారి శ్రీనివాసరావు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానాను విధించినట్లు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. వడ్డి సంతోష్ పలుసార్లు ఇతరులను నిందించడం, బెదిరిస్తుండడంతో అదే గ్రామానికి చెందిన ఇప్పిలి కృష్ణారావు ప్రశ్నించాడు. దీంతో కృష్ణారావుపై దాడికిచేశాడు. ఈనేపథ్యంలో కృష్ణారావు సంతోష్‌పై ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి కాశీబుగ్గ ఎస్‌ఐ ఎస్.శంకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేశారు. ఈ కేసుపై సోంపేట ఏఎస్‌జేకోర్టు న్యాయాధికారి శంకరరావు తీర్పువెలువరించారు. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ దువ్వు జగన్నాయకులు వాదనలు వినిపించారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు

టెక్కలి, మే 9(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మెయిన్ రోడ్డులో ఈనెల ఏడో తేదీన వర్షిణి బ్యూటీపార్లర్ అండ్ లేడీస్‌కార్నర్ నిర్వహిస్తున్న నర్సిపురం లక్ష్మిని భర్త తిరుపతిరావు హత్యచేసిన కేసులో తిరుపతిరావును శుక్రవారం పోలీసులు అరెస్టుచేశారు. కోటబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సత్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ బ్యూటీపార్లర్‌లో ఉన్న లక్ష్మిని తిరుపతిరావు చాకుతో పీక కోయడంతో మృతిచెందిందని తెలిపారు. నిందితుడు శ్రీనివాసరావును కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు చెప్పారు.

బీటలు వారి.. పెచ్చులూడి

● ఊగుతుండడంతో భయాందోళన చెందుతున్న గ్రామస్థులు ● ఇదీ బిర్లంగిలో నీటి ట్యాంకు వద్ద పరిస్థితి


శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్

ఇచ్ఛాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బిర్లంగిలో మూడు దశాబ్దాల కిందట నిర్మించిన నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ప్రధానంగా బీటలు వారడంతోపాటు పెచ్చులూడడంతో ప్రమాదకరంగా మారింది. ట్యాంకు ఊగుతుండడంతో ఏ క్షణంలో కూలిపోతుందోనని ఆనుకుని ఉన్న గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు.

మూడువేల మంది జనాభా తాగునీటి అవస రాల కోసం మూడు దశాబ్దాల కిందట గ్రామం మధ్యలో పీడబ్ల్యూఎస్ పథకం కింద నీటి ట్యాంకు ఏర్పాటుచేశారు.తర్వాత నిర్వహణ, మరమ్మతులకు లేకపోవడంతో ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ట్యాంకు ఊగుతుండడంతో తక్షణమే తొలగించాలని గ్రామస్థులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో పరిశీలించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికా రులు కలెక్టర్‌కు నివేదిక అందజేసి తొలగింపునకు చర్యలు చేపడతామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పది రోజుల కిందట ట్యాంకు నుంచి నీటి వినియో గానికి నిలిపివేశారు. ఉద్దానం ప్రాజెక్టు నుంచి కుళాయిల ద్వారా నీరందిస్తున్నారు.ప్రధానంగా గ్రామం మధ్యలో నిత్యం వందలాది మంది సంచరించే ప్రాంతంలో ట్యాంకు ఊగుతుం డడంతో భయాందోళన నెలకొంది. పిల్లలు ఆడుకునే సమయంలో అటుగా వెళ్తే ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని భీతిల్లుతున్నారు. అసలే వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు పరిసరాల్లోనే ఎక్కువగా ఆడుతుంటారని గ్రామ స్థులు చెబుతున్నారు.తక్షణమే జనావాసాల మధ్యలో ఉన్న నీటి ట్యాంక్‌ను తొలగించాలని సర్పంచ్ బృందా వతి, టీడీపీనాయకులు దూపాన సూర్యనారాయణ అధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లారు.

నిరుద్యోగులకు అండగా ప్రభుత్వం

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


నరసన్నపేట: మాట్లాడుతున్న బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, మే 9(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు.శుక్రవారం నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడాదిగా నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయన్నారు. మెగా డీఎస్సీ నిర్వహణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబునాయుడు కృషితో రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు.జిల్లాలో ఈఏడాది 1,327 మందికి ఉపాధి అవకాశాలను కల్పించినట్లు చెప్పారు.కార్యక్రమంలో జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ డిగ్రీ కళశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబ సభ్యులకు పరామర్శ

పోలాకి,మే 9 (ఆంధ్రజ్యోతి): చెల్లాయివలసకు చెందిన టీడీపీ కార్యకర్త బట్న నరసయ్య మృతిచెందడంతో ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి కుటుంబసభ్యులను శుక్రవారం పరామర్శించారు.ఆయన వెంట ఎంవీనాయుడు, ఆర్‌కే నాయుడు, భాస్కరరావు ఉన్నారు.

సంక్షేమానికి ప్రాధాన్యం

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రాధాన్యతగా పాలన సాగుతోందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు.పాతపట్నంలోని రాళ్లక్వారీవీధికిచెందిన పోతలసోమేశ్ కుమారుడు విజయ్ కిడ్నీసంబంధిత వ్యాధితో బాధపడేవాడు.వైద్యం చేయించుకొనేందుకు ఆర్థికస్థోమతలేకపోవడంతో ఎమ్మెల్యేను ఆశ్రయించారు. దీంతోఎమ్మెల్యే స్పందించి సీఎం సహాయనిధి నుంచి రూ.నాలుగు లక్షలు మంజూరు చేయించారు.సంబంధిత ఎల్‌వోసీ పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు పాతపట్నంలోని క్యాంపుకార్యాలయంలో శుక్రవారం అందజేశారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి: ఎస్పీ


మాట్లాడుతున్న మహేశ్వరరెడ్డి

పలాస,మే9(ఆంధ్రజ్యోతి):ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి పెండింగ్ లేకుండా పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎస్పీ మహే శ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఆవరణలో ప్రజాఫిర్యాదులనమోదు,పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్దనుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదుదారులు అర్జీలు,వారి వివరాలు కాశీబుగ్గ సబ్‌డివిజన్ పరిధిలో సంబంధిత పోలీసులు చర్యలు తీసుకొనిబాధితులకు న్యాయంచేయాలని ఆదేశించారుఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక ద్వారా పంపించాలని కోరారు.

అక్రమ కట్టడాలను గుర్తించాలి: కమిషనర్

పలాస, మే 9 (ఆంధ్రజ్యోతి): అక్రమ కట్టడాలను గుర్తించి ఆదాయం పెంచాలని కమిషనర్ ఎన్.రామారావు ఆదేశించారు. శుక్రవారం పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలోగల మునిసిపల్ సిబ్బంది, వార్డు సచివాలయం, ప్లానింగ్ కార్యదర్శులతో టౌన్ ప్లానింగ్ సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణదారులకు ప్లాన్ అప్రూవల్‌పై అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవానికి సచివాలయం సిబ్బంది సహకరించాలని కోరారు.

తీరంలో అప్రమత్తంగా ఉండాలి

● పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో మెరైన్ పోలీసుల అవగాహన


బావనపాడులో గ్రామస్థులతో మాట్లాడుతున్న మెరైన్ సీఐ రాము

సంతబొమ్మాళి,మే9 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భావనపాడు మెరైన్ సీఐ డి.రాము పిలుపునిచ్చారు.శుక్రవారం మండలంలోని బావనపాడు, సున్నాపల్లి, మేఘవరం తదితర తీరప్రాంత గ్రామాల్లో పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పర్యటించారు. మండలంలోని తీరప్రాంతంలో ప్రజలకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.కార్యక్రమంలో సిబ్బంది వేణు తదితరులు పాల్గొన్నారు.

నగరంపల్లి రోడ్డుకు రూ.79 లక్షల మంజూరు

వజ్రపుకొత్తూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నగరంపల్లి మీదుగా పెద్దబడాంవరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.79లక్షల నాబార్డు నిధులు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ ఏఈ నాగభూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. పూండి- చినము రహరిపురం, అమలపాడు- సైనూరు రోడ్లు పునర్నిర్మాణానికి కూడా నాబార్డు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

విద్యుత్ ఒప్పందం రద్దుచేయాలి



టెక్కలిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

టెక్కలి, మే 9(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం యాక్సిస్ తోవిద్యుత్ ఒప్పందం రద్దు చేసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు.శుక్రవారం టెక్కలిలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వం యాక్సిస్, సెకీ ఒప్పందాలు, స్మార్ట్ మీటర్లు, ట్రూ ఆప్, సర్‌చార్జీలు రద్దు చేయాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో కొల్లి ఎల్లయ్య, వెంకట్రావు, ప్రసాద్, ధర్మారావు, రాజు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలను తీసుకువెళ్లాలి: ఎంఈవోలు

పోలాకి,మే9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను హెచ్‌ఎంలు తీసుకువెళ్లాలని ఎంఈవోలు కె.శ్రీనివాసనాయక్, లింగరాజు కోరారు. శుక్రవారం గంగివలస కేజీబీవీ పాఠశాలలో భద్రపరచిన పుస్తకాలను తరగతుల వారీగా చేపట్టిన పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి 17 వేల పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం తొలివిడతగా సరఫరా చేసిందన్నారు. పోలాకిలో వసతి సౌకర్యంలేక గంగివలస కేజీబీవీ పాఠశాలలో భద్రపరిచినట్లు తెలిపారు.కార్యక్రమంలో సంక్షేమాధికారిని జి.శారద పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీలో తాగునీటి పైపు లీకేజీ


పైప్‌లైన్ లీకవడంతో వృథాగా పోతున్న నీరు

టెక్కలి, మే 9(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని ఎన్టీఆర్ కాలనీ 18వ లైన్‌లో తాగునీటి పైపులైన్ లీకవ్వడంతో తాగునీరు వృథాగా పోతోంది. తక్షణమే అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతుచేసి ఎన్టీఆర్ కాలనీ వాసులకు తాగునీరందించాలని బీజేపీ నాయకుడు లింగరాజు చిట్టిబారికి కోరారు.

నేటి నుంచి పాల ధర పెంపు

విశాఖపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి: పాల వినియోగదారులపై మరింత భారం మోపేందుకు విశాఖ డెయిరీ యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం నుంచి పాల ధరను లీటరుకు రెండు రూపాయలు, పెరుగు ధరను కేజీకి రెండు రూపాయలు పెంచుతున్నట్టు ప్రకటించింది. నూతన ధరల ప్రకారం హోమోజినైజ్డ్ డబుల్ టోన్డు పాలు 500 ఎంఎల్ (అర లీటరు) ప్రస్తుతం రూ.25 ఉండగా, రూ.26కు పెంచింది. లీటరు రూ.50 నుంచి రూ.52 చేసింది. హోమోజినైజ్డ్ టోన్డు పాలు అరలీటరు రూ.27 నుంచి రూ.28కు, లీటరు ప్యాకెట్ రూ.54 నుంచి రూ.56కు, టోన్డు పాలు అరలీటరు రూ.27 నుంచి రూ.28కు, స్టాండర్డైజ్డ్ పాలు అర లీటరు రూ.30 నుంచి రూ.31కు ఫుల్ క్రీమ్ పాలు లీటరు రూ.63 నుంచి రూ.66కు, హోమోజినైజ్డ్ టోన్డు పాలు (గంగ) అరలీటరు రూ.28 నుంచి రూ.29కు, డబుల్ టోన్డు పాలు (గంగ) రూ.26 నుంచి రూ.27కు పెంచింది. కాగా టోన్డు పెరుగు 180 గ్రాముల ప్యాకెట్ రూ.14 నుంచి రూ.15కు, 900 గ్రాముల ప్యాకెట్ రూ.54 నుంచి రూ.56కు, కేజీ ప్యాకెట్ రూ.64 నుంచి రూ.66కు పెంచారు. పెరిగిన ధరలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి.

రూ.10 లక్షలకు పైగా భారం

విశాఖ డెయిరీ ప్రతి రోజు సుమారు 5 లక్షల లీటర్ల పాలను విక్రయిస్తుండడంతో డెయిరీ పరిధిలోని ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వినియోగదారులపై రోజుకు సుమారు రూ.10 లక్షల మేర అధిక భారం పడుతుందని అంచనా వేస్తున్నారు. కాగా 2023 మార్చి 16న పాల ధరను పెంచిన విశాఖ డెయిరీ యాజమాన్యం రెండేళ్లకే మరోసారి ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

పార్శిల్ కార్యాలయం పరిశీలన

టెక్కలి, మే 9(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీలో సరకురవాణా, కొరియర్ పార్శిల్ చార్జీలు తక్కువగా ఉండడంతో ఎక్కువమంది వినియోగదారులు మొగ్గు చూపుతున్నారని సరుకు రవాణా సహాయక మేనేజర్ డి.దివ్య తెలిపారు. శుక్రవారం టెక్కలిలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న పార్శిల్ కార్యాలయాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి డిపోలో ఉదయం ఏడు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు పార్శిల్ కార్యాలయాలు తెరిచిఉంటాయని తెలిపారు.సరుకు రవాణాకోసం డీజీటీలను అద్దెప్రాతిపదికన ఇస్తామన్నారు. వివరాలకు 7331147260, 9908190801 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కుమార్, కమలాకర్ పాల్గొన్నారు.

యంత్రాలతో ఇసుక తవ్వితే చర్యలు: తహసీల్దార్

కొత్తూరు,మే 9(ఆంధ్రజ్యోతి):వంశధార నది గర్భంలో యంత్రాలతో ఇసుక తవ్వితే ఆ యంత్రాలను సీజ్‌చేసి చర్యలుతీసుకుంటామని తహసీల్దార్ బి.బాలకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం ఆకులతంపర ఇసుక పాయింట్ పరిశీలించారు.ఈసందర్భంగా స్టాకు పాయింట్ నిర్వాహకులు నిబంధనలు విధిగా పాటించాలని ఆదేశించారు.

'కూలి'పోతున్నారు!

(ఐదో పేజీ తరువాయి)

పథకం కింద 3.84 లక్షల జాబ్‌కార్డులు ఉండగా.. 6.18 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. ప్రస్తుతం 2 లక్షల మంది వేతనదారులు పనులకు వెళ్తున్నారు. ఉదయం 6 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతుండడంతో వేతనదారులు అవస్థలు పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసే చోట టెంట్లు ఏర్పాటు చేసేవారు. ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి ఊసేలేదు. ప్రస్తుత ప్రభుత్వం కూడా వీటి ఏర్పాటుపై దృష్టి సారించడం లేదని వేతనదారులు ఆవేదన చెందుతున్నారు. ప్రమాదాల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

అదనపు వేతనం లేదు

గతంలో వేసవిలో ఉపాధిహామీ కూలీలకు అదనపు వేతనం ఇచ్చేవారు. వేసవిలో పనులు చేయడం కష్టమనే ఉద్దేశంతో మార్చిలో 20శాతం, ఏప్రిల్, మే నెలలో 30శాతం అదనంగా డబ్బులు ఇచ్చేవారు. అలాగే పరికరాలకు సంబంధించి ఒక్కో వేతనదారుడికి రోజుకు తాగునీటి కోసం రూ.5, గునపానికి రూ.10, తట్టకు రూ.3 చొప్పున చెల్లించేవారు. 20 మంది వేతనదారులు నెలకు రూ.1000 చొప్పున మజ్జిగ కోసం డబ్బులు ఇచ్చేవారు.ప్రస్తుతం ఇవేవీ లేవని వేతనదారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించాలని, అదనపు వేతనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

పనికి రాకపోతే బతుకు లేదు



ఎండలు మండుతున్నా.. ఉపాధి హామీ పథకం పనులు చేయకపోతే నాకు బతుకు లేదు. మూడు రోజులుగా ఎండతోపాటు వేడిగాలులు వీస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి నీడ సౌకర్యం కల్పించాలి.

- రాము, వేతనదారుడు, పెద్దపెద్మాపురం

కష్టంగా ఉంది



గతంలో పనుల వద్ద వైద్యకిట్లతోపాటు టెంట్లు ఉండేవి. తాగునీరు, మజ్జిగ ఇచ్చేవారు. ప్రస్తుతం అటువంటి ఏమి లేవు. పనులు చేయాలంటే కష్టంగా ఉంది.

- రామారావు, వేతనదారుడు, పెద్దపద్మాపురం

ప్రతిపాదనలు పంపాం



ఉపాధిహామీ పనులు చేసేచోట్ల సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం వేతనదారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్నాం. నీడనిచ్చేలా పందిర్లు ఏర్పాటు చేస్తాం. వృద్ధులు పనులు చేసేటప్పుడు జాగ్రత్తగా చూసుకోవాలని మేట్‌లను ఆదేశించాం.

- నర్సింహ ప్రసాద్‌పండా, ఎంపీడీవో, మెళియాపుట్టి

పారాలీగల్ వలంటీర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి, మే9(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు సముదాయాల పరిధిలో పారాలీగల్ వలంటీర్ల నియామకానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయదలచిన వారు పదో తరగతి లేదా మెట్రిక్యులేషన్‌అర్హత కలిగిఉండాలని, టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల పరిధిలో నివాసితులై ఉండాలని పేర్కొన్నారు.

●పాతపట్నం, మే9 (ఆంధ్రజ్యోతి): పారాలీగల్ వలంటీర్లకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాతపట్నం జూనియర్ సివిల్ న్యాయాధికారి మానెం రోషిణి ఒక ప్రకటనలో తెలిపారు. పాతపట్నం, సారవకోట, హిరమండలం మండలాల పరిధిలో పనిచేసేందుకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి, మైత్రిసంఘ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎన్‌జీవోలు, విశ్రాంత ప్రభుత్వోద్యోగులు,వైద్యులు, లావిద్యార్థులు ఈనెల14 లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

19న భూముల లీజుకు వేలం

పాతపట్నం, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగారసింగిలో జగన్నాథ, రాధాకాంతస్వామి ఆలయభూములు లీజు వేలం ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఆలయం ఈవో టి.వాసుదేవరావు ఒకప్రకటనలో తెలిపారు. ఆలయానికి వివిధ సర్వేనెంబర్లలో ఉన్న 39.53 సెంట్లు భూమిని 2025-26, 2027-28 సంవత్సరం వరకు లీజుకు ఇవ్వడానికి వేలం జరగనుందని పేర్కొన్నారు.

ఎంపీడీవోగా వెంకటరమణ

మందస, మే9 (ఆంధ్రజ్యోతి): మందస ఎంపీడీవోగా వై.వెంకటరమణ శుక్రవారం బాధ్యతలుచేపట్టారు.గతంలో వజ్రపుకొత్తూరు ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు మందస ఇన్‌చార్జిఎంపీడీవోగా విధులు నిర్వహించేవారు. కాగా శ్రీకాకుళం మండల పరిషత్ పరిపాలనా విధులునిర్వహిస్తున్న వై.వెంకటరమణను మందస రెగ్యులర్ ఎంపీడీవోగా ప్రభుత్వం నియమించింది.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా వసుధ

ఎల్.ఎన్.పేట, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకపేట పీహెచ్‌సీ వైద్యాధికారిగా వసుధ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ వైద్యాధికారులుగా పనిచేసిన లక్ష్మీదీప్, నీతూలు ఉన్నత చదువులకోసం ఇటీవల వెళ్లారు.దీంతో ఇప్పటివరకూ సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. సోనియ ఇన్‌చార్జి వైద్యాధికారిగా పనిచేశారు.

బిట్-1 లో సర్వేకి ఆదేశం

కొత్తూరు, మే 9(ఆంధ్రజ్యోతి): మెట్టూరు బిట్-1లో స్థలాల కేటాయిం చడంపై సర్వే చేయాలని కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు ఆదేశించినట్లు ఆ గ్రామస్థులు తెలిపారు. మెటూరు బిట్-1 వంశధార నిర్వాసిత కాలనీలో సర్వే చేయాలని ఇటీవల జరిగిన ప్రజాదర్బార్‌లో బిట్-1 గ్రామస్థులు విన్నవించడంతో టెక్కలి ఆర్డీవోకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. కాలనీలో పలు అవకతవకలకు పాల్పడిన ఓ వ్యక్తి నిర్వాసితులకు ఇబ్బందిపెడుతుండడంతో చర్య తీసుకోవాలని సూచించినట్లు సమాచారం.

అభయాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ

నందిగాం, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లపూడిలో అభయాంజనేయ స్వామిమందిరం శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా స్థానిక అభయాంజనేయ యువజనసంఘ సభ్యులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో పురోహితులు వెంకటేశ్వర శర్మ నేతృత్వంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ఆదిశేషవాహనంపై శ్రీనివాసుడు

నరసన్నపేట, మే9(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడురోజులుగా జరుగుతున్న శ్రీనివాసుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆదిశేషవాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు.వేదమంత్రాలమధ్య శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసునికి ఉదయం సుప్రభాత సేవతో పూజలు ప్రారంభంకాగా, ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేకంగా అలంకరించారు. పల్లకిసేవతోపాటు హోమాలను రుత్వికులు నిర్వహించారు.కలివరపుపేట,తిరుమలవీధి, కొత్త, పాతబస్టాండ్ తదితర వీధుల్లో తిరువీధి నిర్వహించారు. ఈసందర్భంగా కూచిపూడి, కోలాటం నృత్యాలు అలరించాయి.

పదో తరగతి విద్యార్థులకు అభినందన

ఒడిశా

పర్లాకిమిడి, మే 9(ఆంధ్రజ్యోతి): పర్లాకిమిడి శిశుమందిర్ పాఠశాల విద్యార్థు ఇటీవలే విడుదలైన పదో తరగతి ఫలితాల్లో సత్తాచాటడంతో పాతపట్నానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పార్లశెట్టి రామరాజు అభినందించారు.ప్రజ్యోతిచౌదరి 566, అంకితా పాడి 533మార్కులతో సాధించ డంతో సన్మానించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం సరోజ్ పండా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.